# 6. డబ్బు సంపాదనార్థాయ....

**మా** "ఎంకటేస్వరా చిలుకు పేలచు" మీన ఆ సంవచ్చరం ఒచ్చిన నాబం-ఇంకా అనేక యిదాల కూడేసిన రొక్కం-నోటినెక్కేసి జూసుకునే సరికి సెప్పలేని కులుకు పొంగుకొచ్చి లోనుంచి యాయాసం తన్నుకొచ్చినాది. ఆ చీమాలచ్మి తల్లిని ఓసారి పేరుసుకుని కల్లతో సూసుకుందారి అని పేనం గిలగిలలాడిపోనాది. పెద్దనోట్లు లెక్కెట్టేఏలకి ఏ పాడుసూపు అయినా పడితే యింకేటైనా ఉందా ఈది తలుపు లోగడియ ఏసుందో నేదో తేరిపార చూసినా... ఎవరో అప్పుడే తలుపుబాదుతుంద్రు. మా సిరసిరలాడిపోనాది ఒల్లు, "నాయుడుగారూ ఓమారు తలుపు తీస్తారా!" ఇంకెవుడు, ఆ గాడిదసారమూ ఆడూ, ఎదవణ ఆ ఎంకట్రావే. ఇట్టాంటి తలమాసినోల్లకి యిల్లద్దికియ్యడమే నాను జేసిన తప్పు ... తప్పుద్దా? తలుపుతీసినా... "ఏం పంతులుగోరు... యింకా జీతం అందుకోనేదేటి, పది దాటిపోనాదే?" ఎంకట్రావు ఏదో ఆపీచులో పనిచేస్తున్నాట్ట, ఎక్కడ సేస్తే నాకేటి! అద్దెరాళ్ళు నాచేతిలోపడ్డమే నాగ్గావాల... బీదోడయినా మంచోడే, "ఇదిగో తెచ్చాను... ఆలశ్యమయిపోయింది మరోలా అనుకోకండి" "ఎంతమాట పంతుగోరూ! నీ కరుసులేవో సూసుకున్నాకే దాకలువేసుకో పోయినావా? ఏదో నీతో అంతా అడావుడి. తే..తే.." రొక్కం నెక్కజూసుకుని రొంటిని దోపుకున్నా.

"నాయుడుగారూ! మీ సహాయం కోరి యిలా వచ్చానండి "

నాకు సెమటలు బోసినయ్... ఈ కలిగినోల్లని చూత్తే పెపంచానికెందుకో యింత దుక్కం... పెతీ ఓరూ సెయ్యిసాసే ఓడే... ...

"మీరు కేవలం డబ్బేకాక హృదయం ఉన్నవారు. తప్పకుండా ఈ ఉపకారం చేసిపెడతారని గంపెడాశతో వచ్చా..."

ఆరి టక్కరోడా నన్నే పొంగేద్దామని సూస్తున్నావట్రా... ఈ గురవయ్య నాయుడంటే ఏటనుకున్నావు? ఒంటి సేతిని నచ్చోపనచ్చులు ఎలా సేస్తున్నాడనుకున్నావురా? ఎర్రినాయలా.

"ఏటో పంతులుగోరు నువ్వేదో సెప్పకొత్తావు. లచ్చాదికారి అని. మీ నెల జీతగాల్లే నయం. ఈ కాంగిరేసు పెబుత్వంకాదుగాని మానెత్తికి సేతుకొచ్చినాయ్‌గంద? ఈ పన్నులు మమ్మల్ని బతకనియ్యవు గంద, ఇక మామేటి తింటాం. మీలాంటోల్లకేం పెట్టగల్గుతాం, ఏటంటవు."

"నేను మిమ్మల్ని డబ్బడగటానికి రాలేదు నాయుడుగారూ!"

ఆర్నీయమ్మ కడుపు సల్లగుండ, ఆడల గొట్టేసినావు గందా!

"నీదొడ్డబుద్ది నానేటి ఎరగనేటి పంతులుగోరూ, మాట సామెతకి సెప్పినా, ఉపకారం పేర్సెసితే ఊల్లోంచి లగెత్తనేం గంద, సెప్పు సెప్పు"

"అందుకనే మీ దగ్గరకొచ్చాను నాయుడుగారూ, మరేంలేదు రెండ్రోజులపాటు మీ ముందు హాలూ, వెనక రెండు గదులూ మాకు కావాలి"

"అదేటి? మీ బుల్లి కప్పుడే పెళ్ళి సేసెత్తావా ఏటి? ఇచిత్తరంగా ఉందే."

"దానికి ఎనిమిదో ఏడు నాయుడుగారూ అందుకేంగాదు, మా చిన్ననాటి స్నేహితుడొకడు మన ఊరు వస్తున్నాడు."

"అలా సెప్పు... మీ సేయితుడిది పెద్దకుటమానం అయుండాల!"

"అదేం లేదండీ! కుటుంబం ఒకవేళ పెద్దదే అయినా వాడు వస్తున్నది ఒంటరిగానే."

"మరేటయ్యా యవ్వారం? అంతా యివరంగా సెప్పు."

"వివరంగా చెబుదామనే నేను వచ్చాను నాయుడుగారూ!"

ఏదో మాయదారి గోల, మనిసేమో మంచోడే. ఇద్దరే పిల్లోళ్ళు. కుసింత కాపుగా వుంటాడుగందా అని యిల్లద్దె కిచ్చినా ఏటి సెపుతాడో ఏటో బెదురు బెదురుగా సెవులొగ్గినా.

"లోకంలో పరిచయస్తులు ఎందరైనా ఉండొచ్చు. స్నేహితులు ఎందరో ఉండరు, మళ్ళీ ఆ స్నేహితుల్లో ప్రాణస్నేహితుడు అనేవాడు ఒకరు ఉంటాడు. చంద్రం నాకు అలాంటివాడే."

ఏదో సెప్పుకు పోతన్నాడు సాద, కానియ్యి యినుకుందారి. కానీ కరుసు లేదుగందా.

"వింటున్నారా? పదేళ్ళయింది వాణ్ణి కలుసుకుని.. ఎప్పుడో ఏ ఏడాదికో క్షేమసమాచారాలు తప్ప ఉత్తరాలుకూడా మానేసుకున్నాం. అయితేనేం ఒకటోక్లాసు నుంచి బియ్యే దాకా కలసి చదువుకున్నాం, నిన్నా మొన్నా జరిగినట్టుంది తలుచుకుంటే, ఈ పదేళ్ళలో మేం పూర్తిగా బికారులం అయిపోయాం. మా అన్నయ్య ఉద్యోగం పోవడం, గాలి వానలకి మా యిల్లు పడిపోవడం, మేం దావాలో భూములు ఓడిపోవడం ఏ కబురూ తెలియదువాడికి. అసలు వాడికబురూ మాకు తెలీదు, ఈ చుట్టుపక్కల ఉంటేగా? రేపు పొద్దుటవస్తే ఎల్లుండిరాత్రికి వెళ్ళిపోతాడువాడు. ఈ రెండ్రోజుల భాగ్యానికీ నా బీదరికం బయట పెట్టి వాడిమనసు బాధపెట్టాలా? మేం యిలా గచ్చులుపోయిన ఓ గదిలో, పడిపోతున్న ఓ వరండాలో అద్దెకుండి గుట్టుగా కాలక్షేపం చేస్తున్నామన్న సంగతి వాడిముందు ప్రదర్శించి వాడి సున్నితమైన మనస్సు ముక్కలుగా చెయ్యాలా? వద్దండీ వద్దు. ఇన్నాళ్ళకి వస్తున్నానని రాశాడు. మళ్ళీ వచ్చినచోటికే ఎంతోదూరంగా వెళ్ళిపోతాడు. వాడప్పుడు ఎరిగున్నదానికీ యిప్పటి నా ఆర్థిక దుస్థితికీ యింత ఆంతరం ఉందని పోల్చుకుంటే వాడు తట్టుకోలేడు. నాయుడుగారూ! ఈ రెండ్రోజులూ మీరూ నాతో నాటకమాడక తప్పదు. ఇది అబద్ధమే.... ఒప్పుకుంటాను. కాని యిల్లా చేస్తున్నందుకు నాకేం విచారంలేదు... నేను హాయిగా జీవిస్తున్నానని అనుకుంటే మా చంద్రం మొహం ఎలా మెరుస్తుందో మీరేచూడగలరు."

అలా సెపుతూంటే ఎర్రిపంతులు కల్లలో నీరు సిందింది. ఓసి. యింత మంచోడా యీ ఎంకట్రావు. యిన్నాల్ల పొద్దయింది నాకెరిక నేదు అని గుండె గుబ గుబ లాడిపోనాది. కాని మా బిజినెస్సోలకి జాలిమనసు కీడుసేసుద్ది అని గ్రహించుకుని వల్లకూరుకున్నా. "ఏటో పంతులుగోరు. యీ యవ్వారం నాకేటీ యిట్టంగానేదు. కొంపనిండా బోలెడుకర్ర చామాను. రెండ్రోజులయితే మటుకు యివన్నీ ఏడెట్టుకుంటాం? నానెక్కడికి పోను! అంతా గెందరగోలం గుందహె."

"మీరలా అంటే నేనేం చెప్పను? మీ ఫర్నిచరేమీ కదపక్కర్లేదు. ఇనప్పెట్టి గది తాళం వేసుకోండి.

ఈ రెండ్రోజులూ మీకు అభ్యంతరం లేకపోతే సిల్కుపేలసు ముందు రూంలో ఉండిపోండి. అక్కడ ఎలాగా ఎటాచ్డు బాత్‌రూమూ అవీ ఉన్నాయి కనక మీకు యిబ్బంది ఉండదు. మీకు రెండు పూటలా వేళతప్పకుండా ఇంట్లో కమ్మగా వండించి పంపించే పూచీ నాది. రెండ్రోజులనగా ఎంత! మీరక్కడ గడిపేది ఒక్కటంటే ఒక్క రాత్రి".

"ఎందుకిన్ని పుర్రాకులు పంతులూ ఆసెంద్రం బాబుని ఏ ఒటల్లోనో దింపుతే పోలా!"

"ఇన్నేళ్ళ తర్వాత ప్రాణంపెట్టే మిత్రుడు వస్తే హోటల్లో దింపమన్నారా నాయుడుగారూ!

"పోనీ నివ్వూ, మీ యాడోలూ ఏలాగో సరుదు కుంటారనుకుందారి మాటొరసకి. మీ బులోల్ని ఏటి సేస్తావంట!"

"నిజమే బాగా జ్ఞాపకం చేశారు. మేం అయితే రెండ్రోజులు ఎలాగైనా గడిపేస్తాం అన్నట్టు ఒక పని చేస్తాం పల్లెటూళ్లో మా చెల్లి ఉంది గదూ అక్కడికి పంపేస్తాం ఎలా ఉందంటారు?"

"ఏటో అంతా లిటిగేసనులాగుంది పంతులుగోరూ! ఏటయితే అవనీ నా కిదంతా యిట్టం గాకుండా ఉందయ్యా"

ఎంకట్రావు నా రెండుసేతులూ దొరక పుచ్చుకున్నాడు.

"ఇంత మహాపట్నంలో చవకగా యిల్లు అద్దెకిచ్చి మా సంసారం నిలబెట్టేరు... ఇప్పుడు మా గుట్టు బయటపెట్టేస్తారా మీరు? కాస్త ఒక్క రాత్రికి ఓర్చుకోలేరా నాయుడుగారూ! ఏభై రూపాయలు ఓ చోట అప్పు తెచ్చేను. ఈ రెండ్రోజులూ మా బీదరికం బయటపడిపోకుండా అన్ని ఏర్పాట్లూ చెయ్యడానికి, ఎందుకైనా మంచిదని మరో పాతికకూడా తెచ్చేను. ఇదిగో యిక్కడ పెడుతున్నాను."

ఎంకట్రావు ఆ సొమ్ము బల్లమీన ఎట్టేడు, నాను తెల్లబోయినా...

"అదేటీ...అద్దేనికీ?"

"మీకే.... ఇంత పెద్దగదులూ ఈ హాలూ యిచ్చినందుకు మరొకరయితే యింత తక్కువకి ఒక్కనాటికి ఒప్పుకోరు.... ఈ రెండ్రోజులకీ అద్దెకింద ఈ కాస్తసొమ్మూ ఉంచండి, బీదవాణ్ణి, అంతకుమించి యిచ్చుకోలేను.

నానెంతసెప్పినా ఎంకట్రావు యినుకోలేదు. సొమ్మక్కడ ఒగ్గీసి యిసురుగా ఎల్లిపోయిండు.

ఆ సొమ్ము దిక్కల అలా సూస్తూఉంటే నా మనసెందుకో ఎల ఎలబోనాది. దీనికి సుమారు ఎయ్యిరెట్టయినా రొక్కం యినప్పెట్టిలో మూలుగుతున్నాది. కల్ల నీల్లెట్టుకున్న ఆ ఎంకట్రావు మొగంముందర, చేయుతుడిమీన ఆడికి కుదిరిన గురిముందల, ఈ సొమ్ము యిలవ ఎంతా అని కొట్టుకుసచ్చినా....సీ...సీ... ఇయాల నాకేటొచ్చింది, చీమానచ్చినే తక్కువసూపు సూస్తాఉన్నానే అని కుసింత కంగారుపడినా... నోకంలో దేనియిలం దాన్దే అని సరుదుకుని ఆ నోట్లు మడతబెట్టుకుని రొంటిని దోపుకున్నా...

రెండ్రోజులకి పాతిక రూపాయలు! ధరలు మండిపోతాఉంటే యిల్లద్దెలు పెరక్కేంచేస్తయి? ఒలె ఒద్దే అంటే యింటి ఆడదాయి యినుకోదు. పెరిగిపోయిన పిల్లగోల్లు మా కొంపల లేరుగంద...

బితుకు బితుకు మనుకుంతా యింతలోగిట్లో మా మిద్దరం ఎందుకంట? మా యాడమనిసిని పెద్దోడి వూరు నించిరానీ... ఎంటనే ఈ ఆలూ రెండుగదులూ అద్దెకిచ్చేత్తే. నెల తిరిగేసరికి ఒంద రూపాయలు సేతిలోపడతయ్... ఏంసేదా? ఎల్తేమనిసి ఒక్కత్తే ఎల్లక పసికు(ర్రోణ్ణికూడా ఎంటబెట్టుకుపోనాదిగంద... ఏటో ఈ ఆడాల్లతో శానా సిక్కొహె....

ఎనక ఒంటగదీ, ఎదర యినప్పెట్టిగదీ తాలాలేసేసినా...

ఈది తలుపేసేక యినప్పెట్టెలో రొక్కం నెక్కెయ్యి మనసయినాది.

పాతికేల పై మాట.... మనసులో మల్లీ మల్లీ అనుకోడమైనా మంచిదికాదు. బాంకులో ఏద్దారంటే ఆపీసోలు మింగెత్తారు, నెక్క జెప్పమని, సెల్లిలి బంగారమంతా కాజేశానని మనల్లుడిగోడి దావా ఉండనే ఉండది. ఇంత విలవ నీ కేడది? ఇంతింత నాబాలు ఏ దొంగయాపారమో సెయ్యందే ఎట్టావచ్చినాది? అని పెశ్నల్తో సంపేత్తారు.... నరుడోడికంట నల్లరాయి బద్దలౌద్దంటారు...ఎట్టా ఈల్లతో ఏగడం!

ఇలా తలుపు లోగడియ ఏశానో నేదో మల్లీ దబీ దబీ సప్పుడు! ఇసుక్కుంటూ తీసినా.... ఎంక(టావు భార్య దురగమ్మ.... ఎంత యినయం.... పెద్దింటి బుల్లి మరి! "మిమ్మల్ని (శమ పెడుతున్నాం, మమ్మల్ని క్షమించాలి బాబుగారూ.... ఇవాళ ఆదివారంగా.... బట్లకొట్టు శలవనీ మీరు వెళ్ళరనీ ఆయనకి తెలుసు.... ఒక్కరూ మళ్ళీ అంతదూరం హోటలుకేం వెడతారు? మిమ్మల్ని యీ పూటకి మా యింట్లో భోంచెయ్యమన్నారు... మీ చెల్లెల్లాంటిదాన్ని, కాదనకండి. వంట సిద్దమయింది. మీరు కాళ్ళు కడుక్కొని కూచుంటే యిక్కడికే తెచ్చి యీ టేబిల్‌మీదే వడ్డించేస్తాను."

ఆ పంతులికి తగిన బార్యే దురగమ్మ..... సేసింది రెండే రకాలయితే మా(త్రమేటి, బెమ్మాండంగా సేసినాది. కొసరి కొసరి తినిపించి నాది.... ఎప్పుడో సచ్చిన మా యమ్మని గ్యాపకం తెచ్చినాది.

"ఇదిగో బుల్లీ యీ పాతికా తీసుకుని ఏకోకో కొనుక్కో" అని సేతిలో పెడదారి అనిపించినాది.

"మా యాపారస్తులికి హృదయం ఎట్టా కుదురుద్ది!" అని తమాయించుకున్నా. ఆ రాతిరికి కూడా దురగమ్మ యింట్లో యిస్తరేస్తేగాని ఒదిల్నాదిగాదు, ఇసురుతూ అందిగందా.

"స్నేహితుడిపట్ల ఆయన అభిమానం తలుచుకుంటే నాకు మతిపోతూ ఉందండి బాబుగారూ. బట్టలు అద్దెకి తెచ్చారు. ఎవరో స(త్రవులో తెలిసిన వాళ్ళున్నారుట గిన్నెలూ కంచాలూ తెచ్చారు. రేపు టేబిల్ క్లాతులూ తెస్తారుట ఇంకా ఎన్నెన్నో చెప్పేరు, నాకెన్నో బోధపరిచారు. మా నాన్న నాపేర రెండిళ్ళు రాసి ఇచ్చారుట తనకేమో స్టేటుబ్యాంకులో ఏజంటు పనిట. ఈ రెం(డ్రోజులూ స్నేహితుడు వచ్చాడుగదా అని శలవు పెట్టేశారుట. ఇదంతా ఎలా పరిణమిస్తుందో ఏమిటో నాకు చాలా భయంగా ఉందిబాబూ. అన్నీ చెయ్యగలం కాని ఇంత పట్నంలో యిల్లెక్కడ అమర్చగలం! ఉన్న యింట్లోంచి, స్వగృహంలోంచి ఒక్కరా(త్రి అయితేనేం వెళ్ళిపోడానికి ఒప్పుకున్నారు మీరు. మీ

సహాయం జన్మలో మరచిపోలేం బాబుగారూ!"

" ఆ యిందులో పెద్ద సేజేసిందేటి బుల్లెమ్మా ఆరిచ్చేగం ముందల నా చగాయం ఏపాటి!" అందారని నోటి కొసదాకా వచ్చినాది. బలిమిని అణుసుకున్నా మనసులో అబిప్పిరాయం బయలెల్లగక్కితే యింతింత యవ్వారాలు సెయ్యగలుగుదుమా!

"అయితే బుల్లెమ్మా! ఆ సెంద్రం బాబుని నివ్వేనా జూచినావా?"

"లేదు బాబుగారూ! నిజంగా ఒక్కొక్కప్పుడు తలుచుకుంటే ఆ స్నేహితుడు వచ్చాక యిక నన్నే మరచిపోతారేమో అన్న భయం కూడా వేస్తోంది. అప్పుడప్పుడు నాతో అనేవారు గాని వాళ్ళ స్నేహం ఇంత గాఢమయిందని నేనెరగను-వారి స్నేహితుణ్ణి చూడాలని వారి కంటెకూడా నాకెక్కువ ఆతృతగా ఉంది బాబుగారూ!"

"మీ యిద్దరికంటే కూడా నాకు ఆరిని సూడాలని తమపుగా ఉన్నాది బుల్లెమ్మా! రేపు కోడికూతతో ఎల్లిపోయి ఎల్లుండి రేతిరికి గాని యిల్లు సేరను గందా, సెంద్రం బాబుని సూసేదెట్టా!"

"ఎంతమాట శలవిచ్చారు బాబుగారూ! ఎల్లుండి మధ్యాహ్నం ఆయన్ని వెంకటేశ్వరా సిల్కు పేలసుకి తీసుకొస్తానని మీతో చెప్పమన్నారు. ఇదంతా మీ చలవేగదా, మీకు చూపించకుండానా!" ఆల్లూ నిజంగా మనసులంటే. ఒక్క పేనానికి సుకం యివ్వడానికి మొగుడూ పెళ్లాం ఎంత కొట్టుకుపోతా ఉండారు!

✪

కొట్టులో బేరాలన్నీ గుమాస్తాగోల్లకి అప్పజెప్పి పేలచు ఎదరగదిలో పంకా ఏసుకుని కూకున్నాను, సెంద్రం కోసం సూస్తా. ఈ రెండ్రోజులూ దురగమ్మ సేతి పాకం మరిగినా, మా యాడాల్ల ఒంటని గ్యాపకం తెచ్చుకుంటూ. సెంద్రం ఒచ్చినాడంట. రాతిరేల దురగమ్మ సెప్పినాది. చేగితులు ఎంత సరదాగా గడిపినారో! నాకు ఒక్కడంటే ఒక్కడు అట్రాంటోడు లేడుగందా అని మనసుని మేగం గమ్మినాది, చాయంకాలం అయినాది. సెంద్రం కోసం సూస్తా కూకున్నాను, ఎవుడో కుర్రాడొకడు సీటీ ఒకటి తెచ్చిచ్చినాడు. అది సదివేతలికి నాకు పేనాల్లేవు!

నాయుడుగారూ! ఈ ఉత్తరం మీకు అందేసరికి నేనూ మాకుటుంబమూ మీయినప్పెట్టెలోని సైకంతో సహా మనరాష్ట్రం సరిహద్దులు దాటుతూ ఉంటాం. మా కోసం వెతికి కాలం వృథా చెయ్యవద్దు. ఎంచేతంటే మా పేర్లు మేం చెప్పినవికావు. నా ఉద్యోగం మీరు అనుకున్నదికాదు. పల్లెటూళ్లో మా చెల్లెలూ లేదు. మేం పిల్లల్ని గుమ్మం దాటించేదీలేదు. ఒకరాత్రి మీయింట మీరు లేకుండా తెలిసో తెలియకో మీరు యిచ్చిన ఆతిథ్యం ఇంతగా మీ సొమ్ము తినదల్చుకున్న మేం ఎలా మరచిపోగలం! ఇక మా చంద్రం అంటారా? కల్పించిన పాత్ర అది, సంభవామియుగేయుగే! అంతే. క్షమించండి, వ్యాపార ధర్మాలు మీరు ఎరగనివి కావు-పంతులు.

★